క్లుప్తంగా

వడ్డాదిలో 10 తాగునీటి బోర్లు ఏర్పాటు



వడ్డాదిలో మంచినీటి బోరుకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాదిలో ఒకేరోజు 10 మంచినీటి బోరు పనులను జెడ్పీటీసీ దొండా రాంబాబు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన రిగ్ బోరు పనులను సోమవారం ఆయన వడ్డాదిలో స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. మేజర్ పంచాయతీలో మంచినీటి సమస్య లేకుండా చేస్తానన్నారు. కార్యక్రమంలో వడ్డాది టౌన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, సర్పంచ్‌లు ఎల్లపు విజయ్‌కుమార్, వరకృష్ణ, నాయకులు కొండ బాబు, శంకర్రావు, రాజా, నాగేష్, యెనుముల వాసు పాల్గొన్నారు.

వై.వి.సుబ్బారెడ్డి మాతృమూర్తికి నివాళులు



వై.వి.సుబ్బారెడ్డి తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి తల్లి వై.పిచ్చమ్మ ఇటీవల స్వర్గస్థులయ్యారు. సోమవారం ఒంగోలు నివాసంలో జరిగిన కర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులర్పించారు.

ఘనంగా నూకాంబిక ఆలయ ప్రతిష్ట



ఆనందపురంలో నూకాంబికను దర్శించుకున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు : ఆనందపురం గ్రామంలో నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిపారు. అర్చకులు శ్రీనివాసశర్మ మండప పూజ, రుద్రాభిషేకం, ధాన్యాదివాసం, బింబదర్శనం, పసిడి కలశ ఏర్పాటు కార్యక్రమాలను జరిపిన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యాన్ని కల్పించారు. కార్యక్రమానికి ఆనందపురం గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారిని కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, శ్రీకాంత్ శ్రీను, సర్పంచ్ వంటాకు అప్పాజి దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

'ఆర్ఈసీఎస్‌లో అవినీతిపై పారదర్శక విచారణ'

అనకాపల్లి: ఆర్ఈసీఎస్‌లో అవకతవకలపై ఇంకా ఎవరైనా ఫిర్యాదులిస్తే స్వీకరించి పారదర్శకంగా దర్యాప్తు చేపట్టాలని తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దర్యాప్తు అధికారిగా నియమితులైన సుగర్ ఫ్యాక్టరీ ఎండీ పీవీఎస్ శాస్త్రి పదవీకాలం మూడు నెలలు మాత్రమే ఉందని, కొత్త అధికారిని తక్షణమే నియమించాలని కోరారు. ఏడాదికి రూ.100 కోట్ల పైనే టర్నోవర్ ఉన్న ఆర్ఈసీఎస్ సంస్థ ఆడిటర్ రిపోర్ట్స్ గోప్యంగా ఉంచి, అవినీతిని బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విచారణ అధికారిగా ఉన్నత స్థాయి అధికారిని నియమించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అవినీతి అక్రమాలను వెలికితీసి బాధ్యులైన వారిపై చట్టప్రకారం శిక్షించాలని కోరారు.

నూకాంబికకు కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న వ్యవస్థాపక ధర్మకర్త శివ గణేష్

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మవారిని సోమవారం కూడా ఎక్కువ మంది భక్తులు దర్శించుకున్నారు. కొత్త అమావాస్య ఉత్సవాల రద్దీ దృష్ట్యా నిరీక్షించాల్సి వస్తోందని ఆయా రోజుల్లో రాకుండా ఇప్పుడు వచ్చి దర్శించుకున్నారు. చీరలు, రవికెలు వగైరా అమ్మవారికి మొక్కుగా చెల్లించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు.

ఘనంగా రంజాన్ వేడుకలు



నర్సీపట్నంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



మాకవరపాలెంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మాడుగులలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకుంటున్న చిన్నారులు



వడ్డాది మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దేవరాపల్లి : ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకొంటున్న ముస్లింలు



వై.బి.పట్నం మసీదులో ముస్లింలు ప్రార్థనలు

నర్సీపట్నం : ఉపవాసాలు, ప్రార్థనలు, దానధర్మాలతో నెలరోజుల పాటు నియమనిష్టలతో గడిపిన ముస్లింలు సోమవారం రంజాన్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి జామీయా మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నాపెద్దలు పరస్పరం ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

నాతవరం: వై.బి.పట్నం గ్రామంలో మసీద్ ఏఆసియా ప్రాంగణంలో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. మోజాన్ దిల్ నవాజ్ ఆధ్వర్యంలో ముస్లింలు పవిత్ర రంజాన్ పండగ నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు అచరించారు. రంజాన్ పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు నాగూర్ మేరా, కార్యదర్శి జిలాని పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు మండల కేంద్రంలో ఉన్న మసీదుకు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొని, పేద ముస్లింలకు ఆర్థిక సాయం అందజేశారు. మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాడుగుల : మాడుగులలో సోమవారం స్థానిక మసీదులో కమిటీ అధ్యక్షుడు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో కమిటీ సెక్రటరీ షేక్ కాలేశావల్లీ, కాషియర్ షేక్ సులేమాన్, ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ హుసేన్, షేక్ నజీర్ వల్లీ అధిక సంఖ్యలో ముసింలు పాల్గొన్నారు.

రోలుగుంట : మండలంలో నిండుగొండ, రాజన్నపేట, ఎస్.కొత్తూరు, కె.నాయుడుపాలెం గ్రామాల్లో ముస్లింలు నిండుగొండ మసీదులోను, బుచ్చింపేట, వడ్డిప తదితర గ్రామాల వారు నర్సీపట్నం, కొవ్వూరు, శరభవరం తదితర గ్రామాల్లో గల ముస్లింలు రోలుగుంట మసీదుకు వచ్చి నమాజ్ చేసుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పుకొని ఆనందం పంచుకున్నారు. బంధువులు, స్నేహితులను ఆహ్వానించి విందు భోజనం చేశారు.

మాడుగుల రూరల్ : కె.జె.పురం మసీదులో సోమవారం ఇమామ్ ఎం.డి. షాకీబ్ ఆధ్వర్యంలో రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. చీడికాడ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, స్థానికులు షేక్ సూరిబాబు కుటుంబ సభ్యులు, మస్తాన్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం, సంజీవమెట్ట మసీదుల్లో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. దేవరాపల్లి, నాగయ్యపేట, చిననందిపల్లి, ఎ.కొత్తపల్లి, తెనుగుపూడి తదితర గ్రామాల నుంచి పిల్లలు, పెద్దలు కలిసి మసీదులకు చేరుకొని కలిసి భక్తి శ్రద్ధలతో నమాజ్ చేశారు. ఖురాన్‌లో పవిత్రమైన వాఖ్యలను తమ మత గురువు వినిపించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మిఠాయిలను పంచుకొని సంతోషంగా గడిపారు.

బుచ్చెయ్యపేట : వడ్డాది మసీదులో సోమవారం పలు గ్రామాలకు చెందిన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పలు పార్టీలకు చెందిన నాయకులు, పలువురు హిందువులు ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

లింగన్న సేవలు ప్రశంసనీయం



లింగన్న దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మీ, జెడ్పీటీసీ సత్యం, బూరె బాబూరావు

దేవరాపల్లి : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పంచాయతీ కార్యదర్శి ఎల్.లింగన్న అందించిన సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం కొనియాడారు. ముషిడిపల్లి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ఎల్.లింగన్న ఉద్యోగ విరమణ సత్కార సన్మాన సభను సర్పంచ్ మతల దేముడమ్మ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. లింగన్న దంపతులను ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్ దేముడమ్మ శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కె.ఎం.పాలెం సర్పంచ్ గంధం రామకృష్ణ, ఎంపీటీసీ బొడ్డు లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ త్రిమూర్తులు, లైన్‌ఇన్‌స్పెక్టర్ తాతబాబు, వీఆర్‌వో గంగునాయుడు, రిటైర్డ్ వీఆర్‌వో గనివాడ ఆచారి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు అప్పారావు, సాంబమూర్తి, నారాయణమూర్తి, పోతల సత్యం, కూనిరెడ్డి శివ, శ్రీరామ్, బొడ్డు అప్పారావు, కొల్లి వెంకటరావు, గొర్లె నాయుడు, రెడ్డి మహేష్, రావాడ రమేష్, అచ్యుతరావు పాల్గొన్నారు.

లింగంపేట నూకాలతల్లి జాతర ప్రారంభం



లింగంపేట నూకాలమ్మతల్లి దర్శనం చేస్తున్న కమిటీ, భక్తులు

గొలుగొండ : లింగంపేట నూకాలతల్లి జాతర ప్రారంభం అయింది. శనివారం రాత్రి అమ్మవారి పూజలు చేసి తల్లి ఆలయం తలుపులు మూసివేసిన అనంతరం సోమవారం 11 గంటలకు కమిటీ, వేదపండితుల ఆధ్వర్యంలో తిరిగి ఆలయ తలుపులు తీయడం జరిగింది. ఈ రోజు నుంచి వారం రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు ప్రతి రోజు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మంగళవారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తామన్నారు. జనసేన నాయకుల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. రాష్ట్ర బీసీ డైరెక్టర్ రాజాన సూర్య చంద్రతో పాటు సలాదులు ప్రసాద్, గండెం దొరబాబు పాల్గొన్నారు.

చురుగ్గా పొంత రోడ్డు పనులు



చురుగ్గా చేస్తున్న రోడ్డు పనులు



బ్రిటిష్ హయాం నాటి పొంత రోడ్డు

నాతవరం: బ్రిటిష్ కాలం నాటి పొంత మట్టిరోడ్డును సిమెంటు రోడ్డు వేసి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. మండలంలో మర్రిపాలెం పంచాయతీ నుంచి ఎం.బెన్నవరం పంచాయతీ శివారు డొంకాడ గ్రామం మధ్య పొంత రోడ్డు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండల వ్యవస్థ ఏర్పడక ముందు తాండవ రిజర్వాయరుకు రోడ్డు వేయక ముందు ఈ పొంత రోడ్డు పైనే రెండు మండలాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగించేవారు. 1971లో నర్సీపట్నం తుని అర్అండ్‌బీ రోడ్డు నుంచి తాండవ ప్రాజెక్టుకు తాండవ జంక్షన్ వెన్నలపాలెం, మర్రిపాలెం, నాతవరం మీదుగా రోడ్డు ఏర్పాటు చేయక ముందు బ్రిటిష్ హయాంలో ఏర్పాటు చేసిన పొంత రోడ్డే ప్రధాన రహదారి. ఈ రోడ్డును మర్రిపాలెం పెద్ద చెరువు గట్టు దగ్గర నుంచి నూకాలమ్మ ఆలయం ముందు నుంచి ఎం.బెన్నవరం పంచాయతీ శివారు డొంకాడ గ్రామం వరకు సిమెంటు రోడ్డుగా నిర్మాణం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. మొదట విడతలో రూ.12లక్షలు మంజూరు చేసి మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ విధంగా ఈరోడ్డు పనులు పూర్తి చేయడంతో మరో రూ.20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈరోడ్డుకు మధ్యలో వెర్రిగెడ్డపై వంతెన నిర్మించేందుకు అదనపు నిధుల కోసం అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఈ రోడ్డు పూర్తి అయితే మర్రిపాలెం, ఎం.బెన్నవరం పంచాయతీలో బాపన్నపేట, మాదంపూడి, పాట్టిపాలెం, కొత్త ఎల్లవరం, వెన్నలపాలెం డొంకాడ, యరంకంపేట, ములగపూడి, డి.యర్రవరం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు దగ్గర దారి అవుతుంది. ప్రధానంగా వెర్రిగెడ్డ రిజర్వాయరు పెద్ద చెరువు కింద వేలాది ఎకరాల ఆయకట్టు భూముల్లో రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు ఎంతో ఉపయోగ పడుతుంది.

చిన్నారుల నృత్య అభినయం



చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ గ్రౌండ్‌లో నూకాంబిక అమ్మవారి జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. భాగవతుల శిరీషారాణి శిష్య బృందం, శ్రీ సాయి నాటి భారతీయ అకాడమీ చిన్నారులు 35 మంది పాల్గొని నృత్య ప్రదర్శన చేశారు. వీరికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నూకాంబిక ఉత్సవ కమిటీ చైర్మన్ గొల్లబాబు, సకల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం



ఆలయంలో వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న సర్పంచ్ సంజీవిరావు తదితరులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు మోదమాంబ ఆలయంలో భక్తులకు దాహార్తిని తీర్చడానికి దాతల సహకారంతో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు స్థానికులు కీర్తి శేషులు ముమ్మిన సత్యారావు, మమత లక్ష్మి జ్ఞాపకార్థం, వారి కుమార్తె అల్లుడు వాసవీ వరప్రసాదు(జర్మనీ), వారి కుమారుడు ప్రవీణ్‌కుమార్, సంధ్య దంపతులు రూ.90వేల ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, అర్చకుడు శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లకు సీసీ కెమెరాలు తప్పనిసరి



కంఫర్ట్‌హోం అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లోనూ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని కంఫర్ట్ హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో 150 ఫ్లాట్ల యజమానులు, తమ నివాసాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభించిన సీఐ మాట్లాడుతూ జోన్ పరిధిలో దొంగతనాల నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. వేసవికాలంలో ప్రజలు చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎక్కువ రోజులు బయటకు వెళితే తప్పనిసరిగా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. ప్రతి ప్రాంతంలో రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నేత్రపర్వంగా భావనారుషి, భద్రావతి కల్యాణం



తోటాడలో భావనారుషి, భద్రావతిల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని తోటాడలో పురాతన శైవక్షేత్రం కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో భద్రావతి సమేత భావనారుషిల కల్యాణం ఆదివారం రాత్రి వేడుకగా నిర్వహించారు. వేద పండితులు రాంప్రసాద్ శర్మ పర్యవేక్షణలో కల్యాణ తంతు జరిగింది. ముందుగా ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించి అనంతరం ప్రత్యేక మండపంలో కల్యాణం జరిపించారు. భక్తుల శివనామస్మరణతో పాటు మంగళవాయిద్యాల నడుమ కన్నుల పండువగా కల్యాణం నిర్వహించారు. ధర్మకర్తలు దొడ్డి సూర్యనారాయణ, త్రినాథ్, సన్యాసిరావు, సత్యనారాయణ, తాతబ్బాయి తదితరులు పాల్గొని పూజలు చేశారు. సమీప గ్రామాలైన నారాయుడుపాలెం, టి.సిరసపల్లి, తోటాడ, గవర్ల అనకాపల్లికి చెందిన భక్తులు కల్యాణం తిలకించేందుకు భారీగా తరలివచ్చారు.

ఘనంగా పైడిమాంబ జాతర

కె.కోటపాడు : మల్లంపాలెం గ్రామస్థులు గ్రామ దేవత పెద పైడిమాంబ అమ్మవారి తీర్థమహోత్సవాన్ని సోమవారం ఘనంగా జరిపారు. తీర్థం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు. జాతర సందర్భంగా ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేటితో ముగియనున్న పదో తరగతి పరీక్షలు

మాడుగుల రూరల్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగుస్తున్నాయి. ఈ నెల 17 వ తేది నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం సోషల్ పరీక్ష జరగాల్సి ఉండగా, రంజాన్ పండగ పురస్కరించుకుని పరీక్షను మంగళవారం నాటికి వాయిదా వేశారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతుందని ఎంఈవో దేముడమ్మ తెలిపారు. మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల ద్వారా 710 మంది రెగ్యులర్ విద్యార్థులు, 73 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఆమె సోమవారం తెలిపారు.

శ్రీరామ నవమి సందర్భంగా క్రీడా పోటీలు

మాడుగుల రూరల్ : గ్రామాలల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు పురస్కరించుకుని ఆదివారం రాత్రి పలు క్రీడా పోటీలు నిర్వహించారు. కె.జె.పురం సీతారామచంద్రమూర్తులు ఆలయంలో నవమి ఉత్సవాల్లో భాగంగా, ఆదివారం రాత్రి చిడతల పోటీలు నిర్వహించారు. నవమి రోజు ఏప్రిల్ 6వ తేదీ వరకూ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు భజన కార్యక్రమం, కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు చద్ది కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు.

సూర్రెడ్డిపాలెంలో మంచినీటి పథకానికి భూమిపూజ



మంచినీటి పథకం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ అనురాధ

కె.కోటపాడు : సూర్రెడ్డిపాలెంలో అదనపు మంచి నీటి పథకం నిర్మాణానికి సోమవారం జిల్లా పరిషత్ స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ భూమి పూజ నిర్వహించారు. జల్‌జీవన్‌మిషన్ నిధులు రూ.20 లక్షలతో 20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి పథకం నిర్మాణం జరపనున్నట్టు ఆమె తెలిపారు. 2022లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గ్రామానికి రూ.20 లక్షల జల్‌జీవన్‌మిషన్ నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ పనులకు సంబందించి టెండర్ ప్రక్రియ పూర్తయినా పనులు ప్రారంభం కానందున ఈ పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని ఆమె అన్నారు. మరలా సూర్రెడ్డిపాలెం గ్రామానికి రద్దు చేసిన ఆ నిధులనే ఈ ప్రభుత్వం మరలా కేటాయించినట్టు అనురాధ పేర్కొన్నారు. ట్యాంక్ నిర్మాణం పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అనురాధ సూచించారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో సర్పంచ్ రొంగలి రాము, నీటి సంఘం వైస్ చైర్మన్ ఈర్లె నరసింహమూర్తి, ఎస్.సూర్యనారాయణ, వనుము అప్పలనాయుడు, ఈర్లె ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిగ్గు తేల్చాలి



నాతవరంలో శాంతి ర్యాలీ చేస్తున్న పాస్టర్లు

నాతవరం : క్రైస్తవ మైనారిటీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటూ మండల కేంద్రంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేకెత్తించిన పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానస్పద మృతిపై మండల పాస్టర్లు క్రైస్తవ మైనారిటీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ప్రధాన కూడలి జంక్షన్‌లో మెయిన్‌రోడ్డుపై మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన పాస్టరు ప్రవీణ్ అనుమానస్పద మృతిపై దర్యాప్తు వేగవంతం వేసి నిగ్గు తేల్చాలన్నారు. పాస్టర్లపై దాడులను నివారించి, రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల పాస్టర్ల సంఘం అధ్యక్షుడు విజయకుమార్, కార్యదర్శి జకర్యా, ప్రసన్న కుమార్, జీవన్‌తిమోతి ప్రభుదాస్ పాల్గొన్నారు.

పచ్చగడ్డి కోసం అల్లాడుతున్న మూగజీవాలు



తీరంలో గడ్డిపరకలు ఏరుకుంటున్న మేకలు

పరవాడ: ఎండలు మండిపోతున్నాయి. మండలంలో పచ్చిక బయళ్లు ఎండిపోయాయి. దీంతో మూగ జీవాలు పచ్చగడ్డి దొరక్క అల్లాడుతున్నాయి. మండలంలో పెదముషిడివాడ, వాడచీపురుపల్లి దరి గొల్లపేట, వెన్నలపాలెం దరి గొల్లలపాలెం, రావాడ దరి బొట్టవానిపాలెం, నాయుడుపాలెం దరి గొల్లపేట గ్రామాలకు చెందిన రైతులు గొర్రెలు, మేకలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఎండా కాలం రావడంతో మూగ జీవాల పోషణ వారికి తలకు మించిన భారంగా మారింది. అక్కడక్కడ కొండ బంజర్లలో ఉన్న పశు గ్రాసం కూడా ఎండిపోయింది. మరో దారి లేక సరుగుడు, వేప ఆకుల్ని తినిపించాల్సి వస్తోందని పాడిరైతులు వాపోతున్నారు. స్థానికులు కొండ బంజర్లను ఆక్రమించి జీడి తోటలను సాగు చేయడంతో గొర్రెలు, మేకలకు గ్రాసం కొరత మరింతగా పెరిగింది. పండగలు, పబ్బాలకు ఇళ్ల వద్ద మేపుకుంటున్న గొర్రెలు, మేకల్ని సాకడం కూడా తలకు మించిన భారంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.